



ఆదివారం ప్రత్యేకం



కొత్త బంగారు లోకం!

కొత్తబంగారు లోకం.. మీకు అవుతుంది సొంతం.. బంగారం కొనుగోలు చేయలేకపోతున్నామనే బాధెందుకు.. ప్రత్యామ్నాయం వచ్చేసిందండోయ్.. 24 క్యారెట్.. 22 క్యారెట్ బంగారు వస్తువులనే కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు.. అచ్చంగా బంగారంలా కనిపించే వెండిపై గోల్డ్ కోటెడ్ ఆభరణాలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి.. అదీ కొనలేరా.. ఇమిటేషన్ జ్యుయలరీ ఉండనే ఉందిగా.. మన బడ్జెట్ మేరకు అందమైన వస్తువులను తీసుకోవచ్చు.. అలంకరించుకోవచ్చు.. మనసును కుదుటపరచవచ్చు.. అదీ కాదంటారా.. ఒక ఏడాది ఆగారంటే.. ఏకంగా తులం రూ.20 వేలకే అచ్చంగా స్వచ్ఛమైన బంగారం కొనేయ వచ్చు.. అదెలాగంటారా.. సామాన్యులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం 9 క్యారెట్ గోల్డ్ అందుబాటులోకి తీసుకురానుంది.. ధర తులం రూ.20 వేల ఉండొచ్చని అంచనా.. ఇంకెం దుకు ఆలస్యం ఏ బంగారం కొంటారో ఆలోచించుకోండి మరి!

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/
(రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

మెరిసేదంతా బంగారం కాదండోయ్..

ఎంత కొన్నా ఇంకా ఇంకా కొనాలనిపించేది బంగారం.. మోజు తగ్గదు.. ఆకర్షణ ఆగదు.. ఆ మెరుపునకు చిక్కితే ఇక అంతే. ఎంతున్నా ఇంకా ఇంకా కావాలని పిస్తూనే ఉంటుంది..మహిళలకైతే పసిడి అంటే మహాపిచ్చి. ధనవంతులకైతే ఇదో స్టేటస్ సింబల్.. పేదోళ్లకు అత్యవస రానికి ఆదుకునే వస్తువు..ఒక రకంగా చెప్పాలంటే పసిడి సురక్షిత పెట్టుబడి సాధనం.. ఇంట్లో ఆడపిల్ల ఉన్న తల్లిదం డ్రులైతే పిల్ల పెళ్లికి బంగారం కోసం ఎన్నో ఆశలు పెట్టుకుం టారు..ముందునుంచే కొంచె కొంచెం కొని కూడబెడతారు. ఇప్పుడా పసిడి పట్టపగ్గాల్లేకుండా పరుగెడుతోంది. రెండు నెల ల కిందట తగ్గినట్లే తగ్గి ఇప్పుడు ఆల్‌టైం హై రేటుకు ఎగబా కింది.దీంతో జిల్లాలో పసిడి అమ్మకాలు గణనీయంగా తగ్గిపో యాయి.ఈ తరుణంలో కేంద్రం కొత్తగా తేవాలనుకుంటోన్న 9 క్యారెట్ గోల్డ్‌పై సామాన్యులు ఆశలు పెంచుకున్నారు. మరి కొందరు పసిడి ప్రియులైతే పెరిగిన ధరలు భరించ లేక గోల్డ్ కోటెడ్ ఉన్న సిల్వర్ ఆభరణాలు కొంటున్నారు.అసలు బంగారు ఆభరణాలకంటే రెట్టింపు డిజైన్లు దొరుకుతున్నాయి. దీంతో వీటిని కొంటుండడంతో ఈ వ్యాపారం జోరందుకుంది.

1963లో 24 క్యారెట్స్ తులం బంగారం రూ.63.25

1964	రూ.63.25
1970	రూ.184
1980	రూ.1,330
1990	రూ.3,200
2000	రూ.4,400
2010	రూ.18,500
2020	రూ.48,651
2024	రూ.75,640

'తరుగ'ని దోపిడీ.. మజూరీతో బేజారు

బంగారం వస్తువులు, ఆభరణాల కొనుగోలులో కాస్త మాయ ఉంటుంది. తరుగు, మజూరీలో కొందరు వర్తకులు ఎంతో కొంత బురిడీ కొట్టిస్తుంటారు.నగిషీలు ఎక్కువగా కావాలంటే తరుగు కూడా ఆ పరిమాణంలోనే ఉంటుంది. ఇవాళ 5 నుంచి 25శాతం వరకూ కూడా తరుగు వేస్తున్నారు. జిగేల్‌మనే పగడాలతో, కళ్లు మిరుమిట్లు గొలిపే రాళ్లతో, ఆకట్టుకునే రంగులతో ఉన్న వస్తువుల్లో బంగారం ఎంత ఉందో చెప్పడం కష్టం. ఇదే అదనుగా వీటిలో భారీ దోపిడీ జరుగుతోంది. ఎక్కువగా బరువు ఉండే రాళ్లు, ముత్యా లు వంటి వాటిని వాడి కొందరు వ్యాపారులు దోచేస్తున్నారు.

సామాన్యుడికి బంగారం లాంటి కబురు..

9 క్యారెట్ వస్తోంది..



ఒకపక్క బంగారం ధరలు భారీగా పెరిగిపోతూ సామాన్యుడు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోయింది. మరోపక్క బంగారం విలువ అధికంగా ఉండడంతో వీటిని ధరించే మహిళలపై రోజు రోజుకు నేరాలు పెరిగి పోతున్నాయి.ఒంటిపై ఉన్న ఆభరణాలు తస్కరించడం, కొన్నిసార్లు చంపేసి లాక్కుపోతున్న పరిస్థితులు పెరిగి పోతుండడంతో కొత్తగా 9 క్యారెట్ బంగారు ఆభరణా లను దించాలని కేంద్రం ఆలోచి స్తోంది. ఇది వచ్చే ఏడాదిలోగా కార్యరూపం దాల్చే అవకాశం ఉంది.వాస్తవానికి ఇప్పుడు ప్రతిఒక్కరూ 22 క్యారెట్ విభాగం లో 916 హాల్ మార్క్ ఆభరణాలే వినియోగిస్తున్నారు. ఇందు లో 91.67 శాతం బంగారం ప్యూరిటీ ఉంటుంది. 8.33 శాతం కాపర్, సిల్వర్ కలుపుతారు. 22 క్యారెట్ల బంగారం గ్రాము ప్రస్తుతం రూ.7,100కు ఎగబాకి కొనలేని పరిస్థితులు తలెత్తా యి.దీంతో కొత్తగా 9 క్యారెట్‌తో బంగారు ఆభరణాలను కేంద్రం దించబోతోంది.ఇందులో బంగారం కేవలం 37.5 శాతమే ఉంటుంది. 42.5 శాతం సిల్వర్, 20 శాతం కాపర్ ఉంటుంది. ఇతర లోహాలు ఎక్కువ మోతాదులో కలపడం వల్ల 9 క్యారె ట్ బంగారం ధర తులం రూ.20 వేలకే వచ్చేయనుంది. అంటే 22 క్యారెట్ అయితే తులం రూ.71 వేలు ఉంది. తద్వా రా 9 క్యారెట్ బంగారానికి డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. 9 క్యారెట్‌లో పసిడి తక్కువగా కలుస్తుంది కాబట్టి అంతగా ఆకర్షణీయంగా కనిపించక పోవచ్చనే వాదన ఉంది. మరోపక్క చాలా మంది బంగారాన్ని పెట్టుబడి సాధనంగా చూస్తారు కాబట్టి దీనిపై ఎంతవరకు మొగ్గుచూపుతారనేది చూడాలి.

తగ్గి పెరిగిన ధర..

కేంద్రప్రభుత్వం జూలైలో పసిడిపై కస్టమ్స్ ట్యాక్స్ తగ్గించడంతో ధరలు ఒక్కసారిగా తగ్గాయి. గ్రాము రూ.6,900 నుంచి క్రమేపీ రూ.6,300 వరకు పడిపోయింది.దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్కసారిగా కొనుగోళ్లు పెరిగాయి. ఒక్క వారంలో కొనుగోళ్లు రూ.550కోట్ల వరకు జరిగాయి. బంగారం కొనుగోళ్లకు సంబంధించి వార్షిక ఫిక్సిడ్ డిపాజిట్లు ఏకంగా రూ.800కోట్ల వరకు వెళ్లాయి. అయితే గత నెలరోజులుగా బంగారం పరుగు పెడుతూనే ఉంది. రెండు రోజుల కిందట శుక్రవారం 22 క్యారెట్ల బంగారం ఏకంగా రూ.7,100 వరకు ఎగబాకింది. అటు ఆల్‌టైం గరిష్టానికి ధరలు పెరగడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొను గోళ్లు సగానికి సగం పడిపోయాయి.

సగానికి పడిపోయిన అమ్మకాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 1,200 వరకు బంగారు ఆభరణాల విక్రయ దుకాణాలున్నాయి. ఇందులో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, మండపేట, పెద్దాపురం పట్టణాల్లో అధికంగా ఉన్నాయి. వీటన్నింటిలో రోజుకు ధరలు తగ్గిన సమయంలో రూ.40 కోట్ల వరకు అమ్మకాలు జరిగేవి. సగటున ఒక్కో దుకాణం రోజుకు 225 గ్రాముల వరకు విక్రయించేవి. ఇప్పుడు రోజువారీ విక్రయాలు రూ.22 కోట్లకు పడిపోయాయి. ఉమ్మడి జిల్లాలో కార్పొరేట్ బంగారం దుకాణాలు అన్ని బ్రాంచ్‌లు కలిపి 50 వరకు ఉన్నాయి. వీటిలో సీజన్ సమయంలో రోజుకు రూ.55 కోట్ల వరకు విక్రయాలు జరిగేవి. ఇప్పుడు ధరాభారంతో రూ.33 కోట్ల వరకు జరుగుతున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పసిడి వర్తక సంఘం విశ్లేషించింది.

- బంగారం ధర దూకుడు
- రోజురోజుకు పెరుగుదల
- పడిపోయిన అమ్మకాలు
- ఉమ్మడి తూర్పున 1,200 దుకాణాలు
- 50కిపైగా కార్పొరేట్ బ్రాంచ్‌లు
- నాడు రోజుకు రూ.40 కోట్ల విక్రయాలు
- ఇప్పుడు రూ.22 కోట్లే
- త్వరలో కేంద్రం 9 క్యారెట్ ఆభరణాలు
- తులం రూ.20వేలకే బంగారం
- సామాన్యుల్లో కొంగొత్త ఆశలు
- బంగారం కోటెడ్ సిల్వర్ ఆభరణాలకు క్రేజ్
- ఇమిటేషన్ జ్యుయలరీకి డిమాండ్

సిల్వర్‌తో ధగధగలు..



గోల్డ్ కోటింగ్‌తో కూడిన సిల్వర్ ఆభరణాలు ఈ మధ్య మార్కెట్లో భారీగా దొరుకుతున్నాయి. గోల్డ్ కోటింగ్‌లా అసలే మాత్రం కనిపించకుండా అచ్చంగా బంగారు ఆభరణాల్లాగే ఉంటున్నాయి. గాజులు, నెక్లెస్, వడ్డాణం, చెవి రింగులు ఒక టేంటి అసలు బంగారు ఆభరణాల కంటే వీటిలోనే వందల కొద్దీ మోడళ్లు లభ్యమవుతున్నాయి. ధరిస్తే అసలు బంగారం లాగే ఇవి నిగనిగలాడుతాయి. పైగా వీటిని కొనుగోలు చేస్తే ఏడాది లేదా ఒక నెలలోనే తిరిగి అదే దుకాణానికి ఇచ్చేస్తే కొనుగోలు ధరలో 55 శాతం బైబ్యాక్ ఆభరణాల రూపంలో ఇస్తున్నారు. అనేక దుకాణాల్లో ఇదే విధానం అమలవుతోంది. దీంతో నచ్చిన ఆభరణాలను మహిళలు కొనుగోలు చేసి తిరిగి కొద్దినెలలకే అవి వెనక్కు ఇచ్చి కొత్తవి తీసుకుంటున్నారు. తద్వారా పసిడి ధరల పెరుగుదల భారం నుంచి బయట పడుతున్నారు. కాకినాడలో త్వరలో గోల్డ్‌కోటెడ్ సిల్వర్ ఆభరణాలు విక్రయించడానికి ఓ కార్పొరేట్ కంపెనీ షోరూం కూడా ప్రారంభించబోతోంది. 22 క్యారెట్ ఆభరణాల దగ్గర నుంచి వన్‌గ్రాం గోల్డ్, గోల్డ్‌కోటెడ్ సిల్వర్ ఆభరణాలు సైతం భారీగా ఆన్‌లైన్‌లో లభ్యమవుతున్నాయి. అనేక మంది మహిళలు ఆన్‌లైన్ ఆర్డర్ ద్వారా రప్పిస్తున్నారు. ఈ మార్కెట్ జిల్లాలో రూ.25కోట్ల వరకు ఉంటుందని అంచనా.



బంగారం ఎలా వస్తుందో తెలుసా..?

- ఆభరణాల తయారీకి బంగారం ఎక్కడినుంచి వస్తోందా తెలుసా? ప్రముఖ కార్పొరేట్ కంపెనీలైనా, చిన్న దుకాణాలైనా కచ్చితంగా బంగారం బిస్కెట్ కొని వీటి నుంచి ఆభరణాలు తయారు చేస్తాయి. నేరుగా విదేశాల నుంచి ఈ బిస్కెట్లు తేవడానికి లేదు. బ్యాంకుల ద్వారా మాత్రమే బిస్కెట్లు, కడ్డీలు కొనుగోలు చేయాలి. జిల్లాలో అనేక కంపెనీలు బ్యాంకుల నుంచి అరకిలో, కిలో 24 క్యారెట్ బిస్కె ట్లు కొంటాయి.కేంద్రప్రభుత్వ పరిధిలోని ఎంఎంటీసీ అనే సంస్థ నేరుగా విదేశాల నుంచి బంగారం బిస్కెట్లు, నాణేలు కొని బయట విక్రయిస్తుంది. ఎంఎంటీసీ నుంచి ఎవరైనా వీటిని కొనుగోలు చేసుకోవచ్చు.
- బంగారం మెత్తగా ఉండి బాగా సాగే గుణం కలిగి ఉంటుంది.వెంట్రుక కంటే సన్నగా సాగదీసినా గట్టిదనం తగ్గదు.ఒక ఔన్సు బంగారాన్ని 300 చదరపు అడుగుల రేకుగా సాగదీయవచ్చు. ఒక గ్రాము బంగారాన్ని ఒక చదరపు మీటరు వైశాల్యం కలిగిన రేకుగా లేదా 20 మైక్రో మీటర్ల మందం ఉన్న 165 మీటర్ల పొడవాటి తీగలా చేయవచ్చు.
- బంగారాన్ని నాణేలు, వస్తువులు, ఆభరణాలు తయారు చేయడం దగ్గర నుంచీ వాడకం విపరీతంగా పెరిగింది. 1930 నుంచి నాణేల చలామణీని ఆపేశారు.
- 2012 నాటికి ప్రపంచంలో 2లక్షల టన్నుల బంగారం ఉత్పత్తి జరిగింది.
- బంగారం స్వచ్ఛతను ఫెన్నీస్ లేదా క్యారెట్లలో కొలుస్తారు.బరువును ట్రాయ్ ఔన్సుల్లో లెక్కిస్తారు.ఒక ట్రాయ్ ఔన్సు అంటే మన పరిభాషలో కిలోన్నర బంగారం.
- బంగారపు దారాలను దుస్తుల ఎంబ్రాయిడరీకి వినియోగిస్తారు.టీవీలు,కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల్లో స్వల్పంగా బంగారాన్ని ఉపయోగించవచ్చని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేసింది.
- బంగారంలో 24 క్యారెట్స్ ప్యూరిటీ కాగా ఆభరణాల తయారీలో 22 క్యారెట్స్ వినియోగిస్తారు. ఏ అభరణమైనా 22 క్యారెట్ ప్యూరిటీ గోల్డ్‌తో మాత్రమే తయారు చేస్తారు. 18 క్యారెట్ బంగారం కూడా ఉంది. డైమండ్స్ తయారీలో ఈ బంగారాన్ని ఉపయోగిస్తారు. త్వరలో 9 క్యారెట్ బంగారం అందుబాటులోకి రానుంది.అదే వస్తే ధరలు తగ్గుతాయి.





అచ్చంగా బంగారమే..

ఒకపక్క పసిడి కొనలేనంతగా పెరగడంతో ఉమ్మడి జిల్లాలో మహిళలు వన్ గ్రాం గోల్డ్‌తో తయారు చేసిన ఇమిటేషన్ ఆభరణాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. రోజువారీగా ధరించడానికి నల్లపూసలు, గాజులు తదితర వన్ గ్రాం ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వస్తువులకు మహా డిమాండ్ ఉంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక వన్‌గ్రాం గోల్డ్ షోరూమ్‌లు వెలుస్తున్నా యంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. చివరకు పెళ్లిళ్లు, పుట్టినరోజుల వేడుకల్లోను బహుమతుల కింద ఈ ఆభరణాలే ఇస్తున్నారు.

వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కౌన్సిల్ తీర్మానం లేకుండా వర్కు ఆర్డర్లు ఇవ్వడంపై సభ్యుల మండిపాటు



అధికార, విపక్ష కౌన్సిలర్ల ఆగ్రహం



చైర్‌పర్సన్ నాగేంద్రమణి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 28: అమలాపురం మున్సిపల్ పాలకవర్గ సమావేశం శనివారం వాడివేడిగా సాగింది. కౌన్సిల్ తీర్మానం లేకుండా వర్క్ ఆర్డర్లు ఇవ్వడంపై టీడీపీ, జనసేన కౌన్సిలర్లు భగ్గుమన్నారు. వాకౌట్ చేసి నిరసన తెలిపారు. పురపాలక సంఘంలో చాలా స్కామ్‌లు జరుగుతున్నాయని ప్రశ్నించేవారి గొంతు నొక్కడం కాదని ప్రజాధనాన్ని కాపాడాలని మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను ప్రశ్నించారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగింది. అజెండా అంశాలు చర్చకు వచ్చినప్పుడు విపక్ష కౌన్సిలర్లు అధికారులు చేస్తున్న అవకతవకలపై ప్రశ్నల వర్షం కురిపించారు. స్కాములు చేస్తూ పోతే చూస్తూ ఊరుకోవాలా అని మండిపడ్డారు. చైర్‌పర్సన్ చాంబర్‌ను చుట్టుముట్టి నినాదాలు చేశారు. కౌన్సిల్ తీర్మానం లేకుండా రూ.39.44 లక్షల పనులకు వర్కు ఆర్డర్లు ఎలా ఇస్తారని టీడీపీ, జనసేన కౌన్సిలర్లు అబ్బిరెడ్డి చంటి, బొర్రా వెంకటేశ్వరరావు, ఆశెట్టి నాగదుర్గ, పిండి అమరావతి, తిక్కా సత్యలక్ష్మి అధికారులను నిలదీశారు. కౌన్సిల్ తీర్మానంతోనే రూ.20లక్షల పనులకు వర్కు ఆర్డర్లు ఇచ్చామని మున్సిపల్ డీఈ సతీష్ చెప్పడంతో విపక్ష కౌన్సిలర్లు ఆగ్రహంతో ఊగిపోయారు. గత కౌన్సిల్‌లో రూ.39.49 లక్షలకు సంబంధించి సీల్టు తొలగింపు పనులు, ఆలం, ముగ్గు కొనుగోళ్ల అంశాలను రద్దు చేయడంతో పాటు వాయిదా వేసిన విషయాన్ని ఎలా మరుగున పెడతారని కౌన్సిలర్లు గండి దేవిహారిక, పడాల శ్రీదేవి ప్రశ్నించారు. ఒకదశలో అధికార, విపక్ష కౌన్సిలర్లు అరుపులు, కేకలతో సమావేశం దద్దిరిల్లిపోయింది. వర్కు ఆర్డర్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండుచేస్తూ నినాదాలు చేశారు. ఎంతకూ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడంతో టీడీపీ, జనసేన కౌన్సిలర్లు సమావేశాన్ని వాకౌట్ చేసి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సమావేశంలో ఏడో అంశంగా ప్రవేశపెట్టిన ఆదాయ, వ్యయ వివరాలకు సంబంధించిన వోచర్ల అంశం చర్చకు రాగానే అధికార వైసీపీ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, మట్టపర్తి నాగేంద్ర, రుద్రరాజు నానిరాజులు ప్రశ్నల వర్షం సంధించారు. ఇటీవల బదిలీపై వెళ్లిన కమిషనర్ వెళ్తావెళ్తా రూ.3.50 కోట్ల విలువైన బిల్లులకు వేలిముద్రలు వేసి వెళ్లిపోయిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొవిడ్ కాలానికి సంబంధించిన బిల్లులు ఇంకా ఎంతకాలం చెల్లిస్తారని మండిపడ్డారు. కమిషనర్ రాజు కల్పించుకుని కౌన్సిలర్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే బదిలీపై వెళ్లిన కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులను వెనక్కు రప్పించాలని కౌన్సిలర్లు డిమాండు చేశారు. చర్యలు తీసుకోవాలంటూ తీర్మానం చేశారు. తొలుత ఇటీవల మృతిచెందిన మాజీ కౌన్సిలర్ కల్వకొలను పుణ్యవతి మృతికి కౌన్సిల్ సంతాపం ప్రకటించి రెండు నిమిషాలు మౌనం పాటించింది.

రైల్వేలైన్ అలైన్‌మెంట్‌పై త్వరలో పూర్తి స్పష్టత: ఎంపీ హరీష్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 28: కోనసీమ రైల్వేలైన్ అలైన్‌మెంట్‌పై త్వరలోనే పూర్తి స్పష్టత ఇస్తామని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ చెప్పారు. ఐదేళ్లలోపు కోనసీమలో రైలు కూత వినిపించడం ఖాయమని స్పష్టం చేశారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రిజర్వేషన్ కౌంటర్‌ను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ ఎక్స్ అఫిషియో సభ్యునిగా హరీష్‌మాధుర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, సిబ్బంది హరీష్‌ను సత్కరించారు. అనంతరం కౌన్సిలర్లు సంసాని బులినాని, మట్టపర్తి నాగేంద్ర మాట్లాడుతూ బాలయోగి జ్ఞాపకార్థం నిర్మించిన స్టేడియం కేవలం దీపావళికి బాణసంచా విక్రయించే కేంద్రంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోనసీమ నుంచి చమురు సంస్థలు కోట్లాది రూపాయల ముడి చమురును తరలించుకుపోతున్నా పురపాలక సంఘానికి సెస్ రూపంలో ఒక్కరూపాయి చూడా అందడం లేదన్నారు. అవసరమైతే పురపాలక సంఘానికి చమురు సంస్థలు ప్రత్యేక గ్రాంటు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ హరీష్ మాట్లాడుతూ కొత్త అలైన్‌మెంట్ ప్రకారం ఎక్కడికక్కడ సమస్యలను గుర్తిస్తూ సర్దుబాటు చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని ఏది ఏమైనా త్వరలోనే అలైన్‌మెంట్‌పై పూర్తి స్పష్టత ఇస్తామన్నారు. అక్టోబరు 4న ఢిల్లీలో జరిగే సమావేశంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ అంశాన్ని ప్రస్తావిస్తానన్నారు. బాలయోగి స్టేడియంను నేషనల్, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ కాంప్లెక్సు స్థాయికి తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాస్‌పోర్టు సేవలను కోనసీమ వాసులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. కామనగరువు-సమనసలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలను పూర్తి చేయాలనే నిర్ణయంలోనే ఉన్నట్టు హరీష్‌మాధుర్ స్పష్టం చేశారు.



ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా బాధ్యతల స్వీకరణ

టెంపుల్, ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ మహేష్‌కుమార్



టూరిజంపై కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష

అమలాపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో టెంపుల్ టూరిజంతో పాటు ఎకో టూరిజం అభివృద్ధి ద్వారా సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. పర్యాటక రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి అధికారులతో కోనసీమలో ఇప్పటికే స్థాపించిన టూరిజం కేంద్రాల నిర్వహణ స్థితిగతులపై కలెక్టర్ సమీక్షించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో కోటిపల్లి, పాశర్లపూడి, ఆదుర్రు, అంతర్వేది, ఎస్.యానాం, దిండి ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాలు విశేషంగా పర్యాటకులను ఆకర్షిస్తున్నాయన్నారు. జిల్లాలో 17 బీచ్ పాయింట్లు ఉన్నాయని, వీటికి అనుబంధంగా పర్యాటకరంగ అభివృద్ధికి అనువైన వాతావరణం ఉన్నదీ లేనిదీ క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించాలన్నారు. పర్యాటక ప్రదేశాలను కలిపి టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలన్నారు. టూరిజంతో పాటు ఇతర రంగాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరికో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. టెంపుల్ టూరిజానికి నూతనంగా ప్రవేశపెట్టిన స్వదేశీదర్శన్, ప్రసాద్ దర్శన్ పథకాలకు స్థానిక ప్రాంతాలు అనువైనదీ కానిదీ గుర్తించాలన్నారు. ఐదు టూరిజం ప్రాజెక్టులకు బోటింగ్ టెర్మినల్ జెట్టీలు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, రిసార్ట్‌లు ఉన్నదీ లేనిదీ ఆరా తీశారు. కేవలం దిండి రిసార్ట్‌లో మాత్రమే ఉన్నట్టు అధికారులు వివరించారు. గోగుల్లంక, పశువుల్లంక, చింతలమోరి, శివకోడులంకల్లో కూడా పర్యాటక రంగ అభివృద్ధికి అవకాశాలు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి పర్యాటక అధికారి డి.వెంకటాచలం, ప్రాంతీయ సంచాలకుడు స్వామినాయుడు, డివిజనల్ మేనేజర్ పవన్‌కుమార్, మేనేజర్ గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల అంశంపై సమీక్ష

అమలాపురం టౌన్, సెప్టెంబరు 28: ప్రాంతాల మధ్య ఆర్థిక ప్రగతి బహుముఖంగా విస్తరించడానికి జాతీయ రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. రహదారి విస్తరణ, అభివృద్ధికి సంబంధించి ఇళ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులు సామాజిక బాధ్యతతో తమవంతు సహకారం అందించాలన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో శనివారం జాతీయ రహదారులకు సంబంధించిన ఇంజనీర్లు రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పాశర్లపూడి-దిండి వరకు నిర్వహిస్తున్న రహదారి విస్తరణ అభివృద్ధి పనులకు సంబంధించి అభ్యంతరాలు, పెండింగ్ అంశాలపై సమీక్షించారు. మూడేళ్ల క్రితం ఇళ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులు ప్రస్తుతం నష్టపరిహారం పెంచాలని అభ్యంతరాలు లేవనెత్తుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ ద్వారా సమగ్రాభివృద్ధికి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. జిల్లాలో జాతీయ రహదారి పాశర్లపూడి-దిండి రోడ్డు విస్తరణ, జాతీయ రహదారులు, రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మొదటి ప్యాకేజీ విస్తరణ పనులు 2022 నవంబరులో పూర్తి అయ్యాయని, రెండో ప్యాకేజీ దిండి నుంచి ప్రారంభమైందన్నారు. భూసేకరణకు ఎదురైన ఇబ్బందులపై చర్చించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, మంత్రిత్వశాఖ పీడీ సాయిశ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ బి.రాము, రామకృష్ణ, సీహెచ్ఎన్‌వీ కృష్ణారెడ్డి, ఈఈ రవికుమార్, ఈఈ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్లమెంటరీ కమిటీ సభ్యునిగా హరీష్‌మాధుర్

అమలాపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక, జౌళి, నైపుణ్యాభివృద్ధి శాఖల పార్లమెంటరీ కమిటీ సభ్యునిగా హరీష్‌మాధుర్‌ను నియమిస్తూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. బసవరాజు బొమ్మై చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ కమిటీలో ఇరు సభల నుంచి 31 మంది ఎంపీలు సభ్యులుగా ఉంటారు. వీరిలో రాజ్యసభ నుంచి పది మంది లోక్‌సభ నుంచి 21 మంది ప్రాతినిధ్యం వహిస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ కమిటీలో హరీష్‌మాధుర్‌కు స్థానం దక్కడం విశేషం. ప్రతిష్టాత్మక పార్లమెంటరీ కమిటీలో సభ్యునిగా స్థానం దక్కడం ఎంతో ఆనందంగా ఉందని హరీష్‌మాధుర్ శనివారం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలోను యువత నైపుణ్యాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.



హరీష్‌కు అభినందనలు




గుప్పెడంత గుండెకు ... ఉప్పెనంత ఒత్తిడి?

» యువతలోనూ పెరుగుతున్న గుండెపోటు కేసులు » నేడు వరల్డ్ హార్ట్ డే

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28:
ఇది వరకు కాలంలో గుండెపోటు కేసులు పెద్దవారిలో మాత్రమే కనిపించేవి. నేటి ఆధునిక కాలంలో యువతలో కూడా గుండెపోటు కేసులు పెరుగుతున్నాయి. గుప్పెడంత గుండెకు ఉప్పెనంత ఒత్తిడి కలిగిస్తున్నాయి. బీపీ, షుగర్, ధూమపానం వంటి అలవాట్లు లేకపోయినా కూడా గుండె జబ్బులు వస్తాయా? అంటే అవుననే చెప్తున్నారు కార్డియాలజిస్టులు. మానసిక ఒత్తిడి, ఆందోళన గుండె జబ్బులకు దారి తీస్తాయని హెచ్చరిస్తున్నారు.

ఆధునిక జీవితంలో యువతలో మానసిక ఒత్తిడి, సామాజిక ఒత్తిడి పెరిగింది. శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పటికీ మానసిక ఆందోళన వల్ల జన్యుపరమైన మార్పులు జరిగి రక్తప్రసరణలో తేడాలతో రక్తం చిక్కబడడం, రక్తనాళాల్లో మార్పులు చోటుచేసుకుని హార్ట్ ఎటాక్‌కు దారి తీస్తోంది.

ధూమపానం, మత్తు పదార్థాలు, ఊబకాయం, మానసిక ఒత్తిడి, అధిక కొలెస్ట్రాల్, పోస్ట్ కొవిడ్ వంటివి ప్రధాన కారణాలుగా కనిపిస్తాయి. అంతే కాకుండా వాయు, శబ్ధ కాలుష్యం, నిద్రలేమి, మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, ఆధునిక ఆహారపు అలవాట్లు గుండె జబ్బులకు దారితీస్తాయి.

ముందుగా గుర్తించడం ఎలా? ఏం చేయాలి?

గుండె జబ్బులను ముందుగా గుర్తించాలంటే... రెగ్యులర్ హెల్త్ చెకప్ అవసరం. బీపీ 120/80, ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ 100లోపు, టోటల్ కొలెస్ట్రాల్ 200లోపు, ఎఫ్‌బీఎస్ 110లోపు, బీఎంఐ 23.5-25.0గా ఉండాలి. గుండె సంబంధిత లక్షణాలు ఉంటే వెంటనే స్పెషలిస్టు డాక్టర్‌ను సంప్రదించాలి. ఆందోళన తగ్గించుకోవాలి. యోగా, మెడిటేషన్, వ్యాయామం, సంగీతం వినడం, మానసికోల్లాసం కోసం కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఉత్సాహంగా గడపడం అలవర్చుకోవాలి.


ముందుగా గుర్తిస్తే ముప్పు తప్పుతుంది



డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్
పల్స్ హాస్పటల్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్

పెద్దవారైనా, యువత అయినా గుండె జబ్బులను ముందుగా గుర్తిస్తే ప్రాణపాయం నుంచి బయటపడొచ్చు. రెగ్యులర్ హెల్త్ చెకప్ తప్పనిసరిగా చేయించుకోవాలి. ఏమాత్రం లక్షణాలు కనిపించినా అశ్రద్ధ చేయకుండా స్పెషలిస్ట్ డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

ఎక్కడుందో!





» తొలుత దివాన్‌చెరువు పుష్కర వనంలో
» అక్కడి నుంచి కడియం వనాల్లోకి
» బెదిరిపోవడమే కారణమా!
» 25 రోజులుగా సంచారం
» అటవీ శాఖ అధికారులకు చిక్కని వైనం
» వదంతులతో భయం భయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వనంలోంచి జనారణ్యంలోకి వెళ్లిన చిరుత అయోమయంగా తిరుగుతున్నట్టు తెలుస్తోంది. వన్యమృగాలు అడవులను వీడి రావడానికి ఇష్టపడవు. కానీ చిరుత పులి ఆహార వేటలో ఇటుగా వచ్చేసింది. చిరుతలు సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకూ 'జంట' కట్టే సమయం. అలా వెతుకులాటలో కూడా అడవి నుంచి తప్పిపోయి ఉండొచ్చు. దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులో తొలిగా ఈ నెల 6వ తేదీన దాని అడుగులను గుర్తించారు. వెంటనే రంగంలోకి దిగిన అటవీ అధికారులు గాలింపు మొదలుపెట్టారు. ఒకవైపు ప్రజలను అప్రమత్తం చేస్తూనే.. పులిని బంధించడానికి అవసరమైన ఏర్పాటు చేశారు. కానీ ట్రాప్ కెమెరాలకు తప్ప బోనుకు చిక్కకుండా చిరుత తిరుగుతోంది. 19వ తేదీ రాత్రి చివరిగా దివాన్‌చెరువు అభయారణ్యంలో చిరుత జాడ కనిపించింది. తర్వాత మూడు రోజులు ఏ అలికిడీ లేదు. 24వ తేదీ రాత్రి 8గంటల సమయంలో కడియపులంకలోని లక్ష్మణస్వామి నర్సరీలో చిరుత అడుగులు కనిపించాయి. అక్కడ ఇళ్ల సమీపం వరకు వెళ్లి వెనుదిరిగింది. బహుశా మేకలు, కోళ్ల వంటివి లేకపోవడంతో వెనక్కు మళ్లిందని అంచనా వేస్తున్నారు. ఆ ప్రాంతంలో 40 ట్రాప్ కెమెరాలు, 4 బోనులు ఏర్పాటు చేశారు. బోన్లు, వాటి బయట ఎనిమిదిచోట్ల మేక పిల్లలను ఉంచారు. కానీ ఈనాటికీ ఫలితం లేకపోయింది. ప్రధానంగా వర్షం అటంకంగా మారింది.

వన్యప్రాణులు ఒకవేళ అడవి నుంచి బయటకు వచ్చేసినా మళ్లీ వాటంతటవే వెనక్కు మళ్లి వచ్చిన దారిన వెళ్లిపోతాయి. గతంలో ప్రత్తిపాడులో పెద్దపులి రెండు నెలలు సంచరించి అడవిలోకి వచ్చిన దారిలోనే వెళ్లిపోయింది. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుందని అనుకున్నారు. చిరుత లేదా పులి వచ్చే మార్గంలో మల, మూత్ర విసర్జన చేస్తుంది. వేటాడిన కళేబరాలు ఉంటాయి. వాటి వాసన ఆధారంగా అదే దారిలో అడవిలోకి వెళ్లిపోతుంది. కానీ వర్షాలు రావడంతో ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. శనివారం వాతావరణం కాస్త తెరిపిచ్చింది. ఎండ రావడంతో చిరుత ఆనవాళ్లు దొరికే అవకాశం కనిపిస్తోంది.

వదంతులతో భయం...

మనుషులకు చిరుత అంటే ఎంత భయమో.. చిరుతకు కూడా మనుషులంటే అంతే భయం. ప్రస్తుతం చిరుత తన గూడుకు చేరుకునే ప్రయత్నంలో ఉంది. ఈ సమయంలో అయోమయానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. చిరుత ఊళ్లోకి రాకుండా శబ్దాలు చేస్తున్నారు. అయితే దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు నుంచి ఆ శబ్ధాల వల్లే వల్ల అయోమయానికి గురై కడియపులంక దిశగా ప్రయాణించినట్టు తెలుస్తోంది. ఆ రోజు సాయంత్రం అభయారణ్యంలోని ఫారెస్టు అకాడమీ ప్రాంతం నుంచి జాతీయ రహదారి దాటి పుష్కర వనం వైపు వచ్చింది. వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా పెద్ద పెద్ద డీజే శబ్దాలు, బాణసంచా కాల్చడం వల్ల ఎటుపోవాలో తెలియని పరిస్థితుల్లో రిజర్వు ఫారెస్టు దాటిందని అంచనా వేస్తున్నారు. ఈలోపు సోషల్ మీడియాలో విపరీతంగా వదంతులు ట్రోల్ అవుతున్నాయి. దీంతో మరింత భయం పట్టుకుంది. చిరుత కోసం ఏర్పాటు చేసిన బోన్ల వద్దకు మనుషులు వెళ్తున్నారు. సెల్ఫీలు కూడా తీసుకుంటున్నారు. దీంతో చిరుత అక్కడ ఉంచిన ఎరకేసి వచ్చే అవకాశాలు తగ్గుతున్నాయి. చిరుత పులులు 200 మీటర్ల దూరంలోని వాసనను కూడా పసిగట్టగలవు. దీంతో బోన్ల వద్ద జనాల పాదముద్రలు, వాసన పసిగట్టి చిరుత ఆ వైపుగా రావట్లేదని అంచనా వేస్తున్నారు.

చిరుత జాడ మళ్లీ కనిపించలేదు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాదరావు



తూర్పు గోదావరి జిల్లా కడియపులంకలో 24వ తేదీ రాత్రి చిరుత అడుగులను చివరిగా గుర్తించామని.. తర్వాత దాని అలికిడి లేదని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాదరావు వెల్లడించారు. చిరుత పులి సంచారంపై వదంతులు వస్తున్న నేపథ్యంలో ఆదివారం ఆయన జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షం కారణంగా చిరుత అడుగు జాడలు కూడా నేలపై ఉండట్లేదని చెప్పారు. ట్రాప్, సీసీ కెమెరాల్లో కూడా చిరుత చిత్రాలు చిక్కలేదన్నారు. చొప్పెల్ల, కేశవరం, మండపేటల్లో కనిపించిదని వార్తలు రాగా వెంటనే తమ బృందాలు చేరుకున్నాయన్నారు. స్థానికులను ఆరా తీసి ఆ సమాచారాలను వదంతులుగా గుర్తించామన్నారు. మొత్తం పది బృందాలు రేయింబవళ్లు గస్తీ తిరుగుతున్నాయని చెప్పారు. చిరుతను బంధించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశామని, అన్ని చర్యలూ చేపడుతున్నామని ప్రసాదరావు వెల్లడించారు.

• జర జాగ్రత్త...



చిరుతను చూసి ఎట్టి పరిస్థితుల్లోనూ పరుగెత్తడం, కూర్చోవడం, తుప్పల్లో నక్కడం వంటివి చేయకూడదు. చేతులు పైకెత్తి కదలకుండా నిలబడాలి. చిరుతను గమనిస్తూ చాలా నెమ్మదిగా అడుగులు వెనక్కి వేస్తూ ఉండాలి. మరీ దగ్గరగా వస్తే చేతులు పైకెత్తి బిగ్గరగా అరవాలి. దాంతో పెద్ద జంతువుగా భావించి చిరుత వెనక్కి మళ్లే అవకాశం ఉంది. ఆరు బయట బహిర్భూమికి వెళ్లరాదు. గుంపులుగా తిరగడం శ్రేయస్కరం. సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకే చిరుత సంచరిస్తోందని ట్రాప్ కెమెరాలకు చిక్కిన ఫొటోల ద్వారా తెలుస్తోంది. అందువల్ల ఆ సమయాల్లో మరింత అప్రమత్తంగా ఉండడం తప్పనిసరి.

• హాని చేస్తే జైలుకే...

చిరుత వన్యప్రాణి కాబట్టి చట్టాలు అత్యంత కఠినంగా ఉంటాయి. చిరుత కనిపిస్తే హాని చేయకుండా బంధించడం పార్వాలేదు. అయితే వెంటనే పోలీసులకు లేదా ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలి. అంతేగానీ కర్రలు, రాళ్ల వంటి వాటితో కొట్టడం, గాయపర్చడం, హతమార్చడం వంటివి చేస్తే మాత్రం వన్యప్రాణుల సంరక్షణ చట్టాల ప్రకారం ఏడేళ్ల వరకూ శిక్ష పడుతుంది. పైగా నాన్ బెయిలబుల్ కేసులు పెడతారు. అందువల్ల చిరుతను అయోమయానికి గురి చేయకుండా నడుచుకుంటే మంచిదని అటవీ శాఖ అధికారులు చెప్తున్నారు. చిరుత కనిపించిన వెంటనే ట్రాన్స్‌క్విలైజ్.. అంటే మత్తు ఇంజక్షన్ ఇవ్వడం కుదరదు. దాని బరువు, వయసు అంచనా వేసి డోస్ ఇస్తారు. అది కూడా పులిని బంధించడానికి వలలు వగైరా ప్రయత్నాలు అయిన తర్వాత మాత్రమే చివరి ప్రయత్నంగా ట్రాన్స్‌క్విలైజ్ చేయాల్సి ఉంటుంది. అందువల్ల చిరుతను పట్టుకునే విషయంలో ఫారెస్టు అధికారులు కూడా చాలా నిబంధనలు పాటించాల్సి ఉంటుంది.

శ్రీనివాసా గోవిందా... శ్రీవేంకటేశా గోవిందా

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.28.30 లక్షలు



ఆత్రేయపురం, సెప్టెంబరు 28: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్య లక్ష్మీ హోమం, బాల భోగం శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తీరువీదుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.28.30 లక్షలు లభించినట్టు ఆలయ ఉప కమిషనరు, ఈవో చక్రధరరావు తెలిపారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఇందుకూరి సుబ్బలక్ష్మి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కోరుకొండ లక్ష్మీనరసింహస్వామికి రూ.2.70 లక్షలు విలువైన
బంగారు కిరీటం బహూకరణ


ఈవో రామచంద్రమోహన్‌కి కిరీటం అందజేస్తున్న దాత

అన్నవరం, సెప్టెంబరు 28: అన్నవరం దత్తత ఆలయం కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామికి శనివారం కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన బి.ఆది నారాయణమూర్తి బంగారు కిరీటం బహూకరించారు. దీనిని దాత ఈవో రామచంద్రమోహన్‌కు అందజేయగా దాతను ఆయన అభినందించారు. దీని విలువ సుమారు రూ.2.70 లక్షలు అని దేవస్థానం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కొండలరావు, డీఈ రాంబాబు, కోరుకొండ ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

కేటుగాళ్లు


స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్ (పైన) పోలీసులు పట్టుకున్న మోటారు సైకిళ్లు



» ఇళ్లను కొల్లగొట్టేవారు ముగ్గురు... మోటారు సైకిళ్లను మాయం చేసేవారు ఇద్దరు
» కాకినాడలో ఐదుగురు నిందితుల అరెస్టు
» రూ. 34 లక్షలు విలువైన చోరీ సొత్తు స్వాధీనం
» వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం, సెప్టెంబరు 28: గుట్టు చప్పుడు కాకుండా తాళాలు వేసి ఉన్న ఇళ్లను కొల్లగొట్టి అందినకాడికి లాగేస్తారు ముగ్గురు. తాళాలు వేసి ఉన్న మోటారు సైకిళ్లను మూడో కంటికి తెలియకుండా తస్కరిస్తారు మరో ఇద్దరు. ఈ తరహా దొంగతనాలకు పాల్పడుతున్న మొత్తం ఐదుగురిని కాకినాడ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ వివరాలను వెల్లడించారు. ఇటీవల రాత్రిపూట నేరాలు, మోటారు సైకిళ్ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఆదేశానుసారం అడ్మిన్ ఎస్పీ భాస్కరరావు నేతృత్వంలో కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో రాత్రిపూట గస్తీని ముమ్మరం చేశారు. శుక్రవారం రాత్రి బృందాలుగా విడిపోయి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు రామకృష్ణారావు పేటలోని ఇసుకలేటి మోజెస్ అనే యువకుడి ఇంటి వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఏలూరు జిల్లా వంకాయగూడెం గాంధీ కాలనీ... ప్రస్తుతం (కాకినాడ రామకృష్ణారావుపేట)కు చెందిన పాత నేరస్తుడు 30 ఏళ్ళ ఇసుకలేటి మోజెస్. రాజమహేంద్రవరం గణేష్‌నగర్‌కు చెందిన పాత నేరస్తుడు 41 ఏళ్ళ ఇసుకలేటి గాంధీ. రాజమహేంద్రవరం రాజేంద్రనగర్‌కు చెందిన 32 ఏళ్ళ తిపర్తి పురుషోత్తమ రామ్‌కుమార్. వారు చేసిన నేరాలను అంగీకరించారు. కాగా నిందితులు తిపర్తి పురుషోత్తమ రామ్‌కుమార్ ద్వారా వారు దొంగిలించిన చోరీ సొత్తును విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. నిందితుల నుంచి రూ.24.99 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు కొత్త కాకినాడ శివారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరని అదుపులోకి తీసుకుని విచారించారు. కాకినాడ రాగంపేటకు చెందిన పాత నేరస్తుడు 19 ఏళ్ళ కడగాల ఏసు. కొయ్యవారి వీధికి చెందిన 24 ఏళ్ళ గొర్రెల దుర్గాప్రసాద్ చేసిన నేరాలను అంగీకరించారు. నిందితులు కాకినాడ, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో తాళాలు వేసి ఉన్న మోటారు సైకిళ్లను మారు తాళాలతో తీసి తస్కరించి గొర్రెల దుర్గాప్రసాద్ ద్వారా విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సా చేసేవారు. నిందితులు ఐదుగురినీ చాకచక్యంగా పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ కృష్ణ, కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చెతన్యకృష్ణ, టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు, ఎస్ఐ వినయ్‌ప్రతాప్, క్రైం ఏఎస్ఐ కొప్పిశెట్టి గోవిందరావు, ధనరాజ్, పుల్లయ్య, హెచ్‌సీలు గొప్పు చిన్న, వర్మ, సత్యమూర్తి, కానిస్టేబుళ్లు మౌళి, నాయుడు, ప్రసాద్, స్వామిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అడ్మిన్ ఎస్పీ భాస్కరరావు, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

పిఠాపురంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా
స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం


పిఠాపురంలో ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 28: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉండగా పిఠాపురానికి మినీ స్టేడియం మంజూరు చేయించి పనులు ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. త్వరలోనే దీనిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్కూల్ గేమ్స్ అండర్-19 ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ, రగ్బీ జిల్లా పోటీలు నిర్వహించి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్లను ఎంపిక చేశారు. 200 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనగా ఆర్చరీలో 24 మందిని, రగ్బీలో 24 మందిని ఎంపిక చేసినట్టు ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను, రావుల రమేష్, కేతవరపు కృష్ణ, జనసేన నాయకులు సూరవరపు సురేష్, చెల్లుబోయిన సతీష్, మార్నీడి రంగబాబు, అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ శివరామకృష్ణ, రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వియ్యపు రామన్నరాజు, అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, సీఈవో నాగలింగేశ్వరరావు, కోచ్ లక్ష్మణరావు పాల్గొనగా, న్యాయనిర్ణేతలుగా నవీన్, వంశీ, శివప్రసాద్, అఖిల్ వ్యవహరించారు.

మావోయిస్టు వారోత్సవాలు ఎవరి కోసం?

వ్యతిరేకంగా వెలసిన వాల్ పోస్టర్లు



ఎటపాక, సెప్టెంబరు 28: ఎవరి కోసం ఈ మావోయిస్టు వారోత్సవాలు? గిరిజనులకు ఉపయోగపడని వారోత్సవాలు మాకొద్దు అంటూ మావోలకు వ్యతిరేకంగా అల్లూరి ఆదివాసీ యువజన సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శనివారం వాల్‌పోస్టర్లు వెలిశాయి. మండలంలోని విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై బండిరేవు, లక్ష్మీపురం, బాసవాగుతో పాటు భద్రాచలం-కూనవరం రోడ్‌లో నందిగామ, మురుమూరు గ్రామాల్లోని కల్వర్టులు, చెట్లకు పోస్టర్లను అతికించారు. అమాయక గిరిజనులను ఇన్ఫార్మర్ల నెపంతో చంపుతున్నారని, బస్సులను దహనం చేస్తూ గిరిజనులకు రవాణా సౌకర్యం లేకుండా చేస్తున్నారన్నారు. వారోత్సవాల ఉచ్చులో తమను లాగొద్దని, సభలు, సమావేశాలంటూ వేధించవద్దన్నారు. స్థూపాలు, కట్టడాలని మీ పాపాల్లో మమ్మల్ని పాలుపంచొద్దని పేర్కొన్నారు. మీదారికి రావాలని బెదిరించవద్దని, గిరిజనుల సహనం పరీక్షించవద్దన్నారు. కాగా మావోయిస్టు వారోత్సవాలు జరుగుతున్న తరుణంలో ఈ పోస్టర్లు వెలవడం చర్చనీయాంశంగా మారింది.

అన్నీ తానై...

తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తె

ఆలమూరు, సెప్టెంబరు 28: కుమారుడు లేని తండ్రికి అన్నీ తానేనని కుమార్తె ముందుకొచ్చి అంతిమ సంస్కారాలు జరిపింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరుకు చెందిన గన్ని అమ్మిరాజు (64) గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తె సీతా మహాలక్ష్మికి వివాహం కావడంతో అమెరికాలో స్థిరపడింది. తండ్రి మరణ వార్త తెలుసుకుని అక్కడి నుంచి బయల్దేరి శనివారం ఉదయ ఆలమూరు చేరుకుంది. తండ్రి అంత్యక్రియలు తానే చేయాలని నిర్ణయించుకుంది. ఆలమూరు గోదావరి ఏటిగట్టు వద్ద ఉన్న హిందూ శ్మశానవాటికలో కర్మకాండలు జరిపి తలకొరివి పెట్టింది.



శృంగారవల్లభ స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, సెప్టెంబరు 28: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతిలోని శృంగారవల్లభ స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు స్వామివారికి పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,32,730 అన్నదాన విరాళాల ద్వారా రూ.62,915, కేశఖండన ద్వారా రూ.7,880, తులాభారం ద్వారా రూ.600, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.25,035... మొత్తం రూ.2,29,160 ఆదాయం వచ్చిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

- తిరుపతి లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీలో దోషులను శిక్షించాలని కూటమి నాయకుల దీక్షలు
- అమలాపురం నుంచి అప్పనపల్లి వరకు పాదయాత్ర

సామూహిక సీమంతాలు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు28: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకుని ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనివ్వాలని జడ్పీటీసీ గెడ్డం సంపదరావు గర్భిణులకు సూచించారు. ఉప్పలగుప్తంలో శనివారం ఐసీడీఎస్ సీడీపీవో కేవీఎల్డీ కుమారి ఆధ్వర్యంలో గర్భిణులకుసీమంతాలు నిర్వహించారు. వస్త్రాలు, గాజులు, పసుపుకుంకుమలతో గర్భిణులను ఆశీర్వదించారు. వైద్యాధికారి లంకే నాగార్జున వైద్య సలహాలు అందించారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కుడుపూడిపై దళిత సంఘాల ఆగ్రహం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

అమలాపురంటౌన్, సెప్టెంబరు28: కులాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి ఎమ్మెల్సీ పదవి తెచ్చుకున్న కుడుపూడి సూర్యనారాయణరావు ఇప్పటికైనా దళితులపై విషం కక్కడం మానుకుని ప్రజాప్రతినిధిగా హుందాగా వ్యవహరించాలని దళిత సంఘాలు హితవు పలికాయి. సుప్రీంకోర్టు అట్రాసిటీ చట్టంపై తీర్పు ఇచ్చిందని, తప్పుడు ప్రచారం చేస్తూ ఆయన వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీహాలులో దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబూరావు, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, కోశాధికారి గెడ్డం సురేష్‌బాబు, రేవు తిరుపతిరావు, పొలమూరి మోహన్‌బాబు మాట్లాడుతూ సూర్యనారాయణరావు ఊసరవెల్లి తరహాలో రాజకీయ పార్టీలు మారుతున్నారని ఎద్దేవా చేశారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నాయకులు ములపర్తి సత్యనారాయణ, సాపే బాలరవి, ఊటాల వెంకటేష్, కాశి వెంకట్రావు, నాగాబత్తుల ప్రసాదరావు, కడిమి అర్జున్, పరమట సింగ్, మెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్పనపల్లి, మందపల్లి ఆలయాలు భక్తులతో కిటకిట





మామిడికుదురు: బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు, కొత్తపేట: మందపల్లి శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మామిడికుదురు, సెప్టెంబరు 28: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు పవిత్ర వైనతేయనదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. కొత్త, పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం స్వామివారిని 4,956 మంది భక్తులు దర్శించుకుని 2765 మంది భక్తులు నిత్యాన్నదానంలో భోజనాలు చేశారని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా శనివారం ఒక్కరోజు రూ.2,18,765 ఆదాయంగా సమకూరిందని ఏసీ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

కొత్తపేట: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలకు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,61,103 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు విజయలక్ష్మి తెలిపారు.

జనావాసాల మధ్య డంపింగ్ యార్డును తరలించండి



గ్రామసభలో సర్పంచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి తదితరులు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 28: బండారులంక శివాలయం సమీపంలో లోయర్ కౌశిక డ్రెయిన్‌ను ఆనుకుని ప్రధాన రహదారి చెంతన ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణం డంపింగ్ యార్డును మరో ప్రాంతానికి తరలించి ప్రజారోగ్యాన్ని కాపాడాలంటూ అధిక సంఖ్యలో మహిళలు, స్థానికులు శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. డంపింగ్ యార్డు సమీపంలోని మహిళలు ఆ ప్రాంతానికి చేరుకుని ముక్కులు మూసుకుని కంపు భరించలేకపోతున్నామంటూ దుర్వాసనతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కర్మకాండలు చేసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పెనుమాల సునీత, కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజుకు వినతిపత్రం ఇచ్చారు. అక్టోబరు2నాటికి సమస్యను పరిష్కరించకుంటే చెత్త ట్రాక్టర్లను అడ్డుకుంటామని మహిళలు హెచ్చరించారు. మాజీజడ్పీటీసీ చింతాశంకరమూర్తి, నల్లా అప్పన్న, చింతా ఉమా, గోళ్ల మల్లేశ్వరరావు, పిచ్చిక మల్లేశ్వరరావు, మాడా మాధవి, కాశిన బాబి పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

ఐ.పోలవరం, సెప్టెంబరు28: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సూచించారు. పశువుల్లంకలో శనివారం ముమ్మిడివరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన పౌష్టికాహార వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, సర్పంచ్ సఖిలే పెద్దిరాజు, ధూళిపూడి చక్రం, ధూళిపూడి రాంబాబు, గోడి శేఖర్, జె.మీనాక్షి పాల్గొన్నారు.

నెయ్యి కల్తీలో దోషులను శిక్షించాలని కూటమి ప్రదర్శనలు







అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారి వాహనాన్ని నడుపుతున్న ఎంపీ హరీష్, అమలాపురంలో జనసేన ప్రాయశ్చిత్త పాదయాత్రలో రమణబాబు తదితరులు, మామిడికుదురు: పాదయాత్ర చేస్తున్న భక్తులతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించిన వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తుంది. జనసేన, కూటమి నేతలు, వైసీపీ పార్టీ నేతలు పోటాపోటీగా శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు హోరెత్తిపోయాయి. ఆయా పార్టీల నేతల ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయాల సందర్శన పేరుతో నిర్వహించిన కార్యక్రమాలు ఉత్కంఠ భరితంగా సాగాయి. వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రాజకీయ పార్టీల నేతలతో కిటకిటలాడాయి. అమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి జనసేన, కూటమి నేతల ఆధ్వర్యంలో అమలాపురం నుంచి అప్పనపల్లికి నిర్వహించిన పాదయాత్రలో ఆ పార్టీల నాయకులు పాల్గొన్నారు. పార్లమెంటు సభ్యులు గంటి హరీష్‌మాధుర్, టీడీపీ నేత మెట్ల రమణబాబులతో పాటు జనసేన నాయకులు నల్లా శ్రీధర్, లింగోలు పండు, యేడిద శ్రీనుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా కూటమి కార్యకర్తలు హాజరయ్యారు. అమలాపురం నుంచి ప్రారంభమైన పాదయాత్ర అప్పనపల్లికి చేరింది. అక్కడ జనసేన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నాయకత్వంలో జనసేన, కూటమి నాయకులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు చేశారు. ఈపాదయాత్రలో భారీగా హిందూ భక్తులు, జనసేన కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా అమలాపురం పట్టణ నడిబొడ్డున గల గడియార స్తంభం సెంటర్‌లో చిక్కం భీముడు ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, జనసేన నాయకులు ఆకుల బుజ్జి, పిండి రాజా, తాళ్ల లక్ష్మీనర్సాయమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ హరీష్‌మాధుర్, టీడీపీ నేత మెట్ల రమణబాబులో శిబిరంలో పాల్గొన్న జనసేన నేతలకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు.

ప్రాయశ్చిత్త రిలే నిరాహార దీక్ష

అయినవిల్లి, సెప్టెంబరు 28: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదం అపవిత్రం చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తూ కూటమి నాయకులు నల్లచెరువులో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. శనివారం దీక్షలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే అలివేలు మంగా, పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈదీక్షలో వర్రే శేషు, మద్దాల సుబ్బారావు, సయ్యపురాజు సత్యనారాయణరాజు, పోలిశెట్టి రాజేష్, సలాది బుచ్చిరాజు, కళ్లేపల్లి సుబ్బరాజు, గుర్రాల రాంబాబు, గణపతి వీరరాఘవులు, వంగా మహేష్, రావూరి చిన్నా, గుండుమోగుల బోసు, రావూరి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

మామిడికుదురు, సెప్టెంబరు 28: తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. నెయ్యి కల్తీ విషయాన్ని నిరసిస్తూ అమలాపురం, రాజోలు నుంచి హిందూ భక్తులు శనివారం నిర్వహించిన పాదయాత్రకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మద్దతు పలికారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా అమలాపురం నుంచి అప్పనపల్లి వరకు ఒక బృందం, రాజోలు నుంచి అప్పనపల్లి వరకు మరో బృందం పాదయాత్ర నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జనసేన నాయకులు, హిందూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కల్తీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

అంబాజీపేట, సెప్టెంబరు28: తిరుపతి లడ్డూ తయారీలో కల్తీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శ్రీవారి లడ్డూ అపవిత్రతపై స్థానిక కొర్లపాటివారిపాలెం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి స్థానిక సెంటర్ వరకు పాయశ్చిత్త దీక్ష నిరసన ర్యాలీ నిర్వహించారు. తొలుతశ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకటసత్యనారాయణ, కొర్లపాటి గోపి, సుంకర బాలాజీ, బొంతు పెదబాబు, దొమ్మేటి సాయికృష్ణ, షైపాల తాతాజీ, గుడాల ఫణి, దొమ్మేటి రామారావు, కొర్లపాటి డీల్లి, గ్రంధి శ్రీను, నాగవరపు అన్నవరం, రవణం రాము, మట్టపర్తి భారతి, అరిగెల నాని, అధికారపు బాబ్జి పాల్గొన్నారు.

మంచినీటి చెరువును అందుబాటులోకి తీసుకురావాలి

అంతర్వేది, సెప్టెంబరు 28: అంతర్వేది దేవస్థానం గ్రామంలో రూ.17.33కోట్లతో నిర్మిస్తున్న మంచినీటి చెరువు పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. చెరువు నిర్మాణ పనుల్లో కొంత జాప్యం ఏర్పడిందని స్థానిక ప్రజాప్రతినిధులు తెలపడంతో ఎమ్మెల్యే దేవ మంచినీటి చెరువు పనులను శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పరిశీలించారు. తీర ప్రాంత గ్రామాలకు త్వరలోనే ప్రతీ ఇంటికీ కుళాయి నీరు అందేలా చూస్తానన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు, సోయల్ తదితర పనులపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆరా తీశారు. ప్రాజెక్టు పనులు 60శాతం పూర్తయ్యాయని, డిసెంబరు నెలాఖరుకు మొత్తం పనులు పూర్తి అవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, చాగంటి స్వామి, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన ఎక్సైజ్ శాఖ డీసీ

మండపేట, సెప్టెంబరు 28: తూర్పుగోదావరి జిల్లా ఎక్సైజ్ శాఖ డీసీ ఏనుగుల చైతన్య మురళీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మండపేట పార్టీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

1న వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా

అమలాపురం టౌన్, సెప్టెంబరు 28: కలెక్టరేట్‌లోని వికాస సంస్థ జిల్లా కార్యాలయంలో అక్టోబరు 1న వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం తెలిపారు.వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ మాట్లాడుతూ రేణిగుంట, తిరుపతి తదితర ప్రాంతాల్లో ఇండో ఎంఐఎం కంపెనీల్లో టెక్నీషియన్లుగా పనిచేసేందుకు పది, ఇంటర్, ఐటీఐపాసైన 18నుంచి 30ఏళ్లలోపు వారు అర్హులన్నారు. గూగుల్‌పేలో ఫీల్డు సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా 45ఏళ్లలోపు వారు అర్హులన్నారు. డిగ్రీలోపు చదువుకున్నవారు ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేయవచ్చునన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ద్రాక్షారామ, సెప్టెంబరు28: నరసాపురపుపేట మెర్ల అంబికేశ్వరరావు సత్రం వద్ద 80ఏళ్ల వృద్ధుడు మరణించాడు. వీఆర్వో ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భేతాళస్వామి ఉత్సవానికి శ్రీకారం

అంబాజీపేట, సెప్టెంబరు 28: అంబాజీపేటలో వచ్చే నెల 16నవిజయదశమి సందర్భంగా నిర్వహించే శ్రీవిజయ బేతాళస్వామి ఉత్సవానికి స్థానిక శ్రీనివాస్‌నగర్‌లోని ఆలయం వద్ద పందిరాట ముహూర్తంతో శ్రీకారం చుట్టారు. శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్టోబరు 3న స్వామివారి కలశస్థాపన నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యమోహనరావు, సంఘ అధ్యక్షుడు దొమ్మేటి రామారావు, విత్తనాల శేఖర్, దొమ్మేటి సత్యమోహన్, కుడుపూడి సత్తిబాబు, దొమ్మేటి సాయికృష్ణ పాల్గొన్నారు.

వినాయక ఆలయాల వద్ద అన్నసంతర్పణ

యానాం, అక్టోబరు 28: స్థానిక యానాంటాక్సీ స్టాండ్ లోని శ్రీపంచముఖ విజయ లక్ష్మీగణపతి ఆలయం, అంబేడ్కర్‌నగర్‌లోని విజయలక్ష్మీగణపతి, ఓల్డ్ రాజీవ్‌నగర్ లోని శ్రీముఖగణపతిస్వామి, కె.వి.ఆర్.నగర్‌లో శ్రీలక్ష్మీగణపతి ఆలయాల వద్ద నిర్వహించిన అన్నసమారాధనల్లో పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. తొలుత స్వామివారికి పూజలు చేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడి పూజ

రాయవరం, సెప్టెంబరు 28: వెదురుపాకలో శ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయం వద్ద అయ్యప్పస్వామి పడి పూజ ఘనంగా నిర్వహించారు. పీఠం గురుస్వామి బండారు వెంకట రమణస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొంకుదురు గ్రామానికి చెందిన అర్చకులు రమణశర్మ స్వాములతో అయ్యప్పస్వామికి వెంకటరమణ, సూర్యకుమారి దంపతులతో పూజ నిర్వహించారు. అయ్యప్పస్వామి విగ్రహానికి 23రకాల ద్రవ్యాలతో అభిషేకాలను అయ్యప్పమాలదారులు జరిపారు. అనంతరం 18మెట్లకు పూజ, పదునెట్టాం పడి కార్యక్రమం నిర్వహించారు. వి.సావరం గ్రామానికి చెందిన త్రిమూర్తులు గురుస్వామి, మహేంద్రవాడ గ్రామానికి చెందిన శ్రీరాములు గురుస్వామి, పందలపాక గ్రామానికి చెంది రమణ గురుస్వామి, వెదురుపాక గురుస్వామి వెంకటరమణ, అంగర వెంకట సుబ్బారావు స్వాములను అయ్యప్పమాలధారులు ఘనంగా సత్కరించారు. 200మంది అయ్యప్ప మాలదారులు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

అల్లవరం, సెప్టెంబరు 28: మండల పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 967పనులకు సంబంధించి రూ.7.74కోట్లు, పంచాయతీ రాజ్ పనులు రూ.3.46కోట్లకు సంబంధించిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో డ్వామా పీడీ మధుసూదనరావు మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది బాధ్యతగా పనిచేసి వ్యవస్థకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ షెడ్లకు సంబంధించి గూడాల, డి.రావులపాలెంలో 15రోజుల్లో పనులు పూర్తిచేయాలన్నారు. రూ.31,469 ఉపాధి హామీ ఖాతాకు ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయాలని ఆయన ఆదేశించారు. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, అంబుడ్స్‌మెన్ అడపా శ్రీనివాసరావు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, ఏపీవో శ్రీనుబాబు, హెచ్ఆర్ సత్యనారాయణ, ఎస్ఆర్పీ కనకరావు, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, బొమ్ము బాలవేణి, బర్రే సీతారత్నం, ఎంపీటీసీ మామిడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

మలికిపురం, సెప్టెంబరు 28: మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీ ఆర్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల సమ్మెతో విద్యార్థుల తరగతుల నిర్వహణకు ఇబ్బందులు కలుగుతున్నదృష్ట్యా కోర్సులు పూర్తి అవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌కు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం ఫిర్యాదు చేశారు. అధ్యాపకుల సమ్మెపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నష్టం లేకుండా కళాశాలను సందర్శించి చర్యలు తీసుకోవాలన్నారు.

'అవి పులి అడుగులు కావు కుక్కవి'




మండపేట, సెప్టెంబరు 28: మండపేట విజయలక్ష్మీనగర్‌లో ఒక ప్రైవేటు పాఠశాలకు సమీపంలో బైపాస్‌రోడ్డును ఆనుకుని ఉన్న ఇండోర్ స్టేడియం చెంతన ఉన్న చిన్న పాటి తోటలో జంతువు అడుగులు ముద్రలు పడ్డాయని పుకార్లు వచ్చాయి. దీంతో స్థానికులు బెంబేలు ఎత్తారు. తూర్పుగోదావరి జిల్లా అటవీ శాఖాధికారిణి పద్మావతి, సిబ్బంది తోటలో కనిపించిన జంతువు పాదముద్రలను పరిశీలించారు. ఆ అడుగులు పులివి కాదని కుక్కవని ఆమె చెప్పడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఆమె వెంట అటవీ శాఖ ఉద్యోగులు రామకృష్ణ, రాజారమేష్ ఉన్నారు. చిరుతపులి గురించి అసత్యాలు సోషల్‌మీడియాలో పోస్టులు పెడితే, వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు సంఖ్యను పెంచాలి

పి.గన్నవరం, సెప్టెంబరు 28: టీడీపీ సభ్యత్వ నమోదు సంఖ్యను పెంచాలని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు తెలిపారు. పి.గన్నవరం పార్టీ కార్యాలయంలో జరిగిన క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు 2నుంచి పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఐటీడీపీ ట్రైనర్ పృథ్వి క్లస్టర్, యూనిట్ ఇంచార్జిలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో దాసరి వీరవెంకట సత్యనారాయణ, మట్టపర్తి రామకృష్ణ, సంసాని పెద్దిరాజు, తోలేటి సత్తిబాబు, మొల్లేటి శ్రీను, సూధా బాబ్జి, బోనం బాబు, కిషోర్, గుడాల ఫణి, గుత్తుల రామకృష్ణ, అంబటి భూలక్ష్మి, అరిగెల బాలరామ్మూర్తి, సత్తిబాబురాజు, చిన్నం బాలవిజయరావు, కుంపట్ల నాయుడు, శేరు శ్రీనుబాబు పాల్గొన్నారు.

జీవుడు అహంకారాన్ని వీడాలి: గరికపాటి



అమలాపురం టౌన్, సెప్టెంబరు 28: జీవుడు అహంకారాన్ని విడిచిపెట్టి కోరికలను దరిచేరనీయకుండా చేసుకోగలిగితే భగవంతుడే అటువంటి వ్యక్తుల ముందు వాలిపోతాడని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్తగరికపాటి నరసింహారావు అన్నారు. దేహాన్ని పవిత్రంగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. దేహమే దేవాలయమన్న విషయాన్ని మరువరాదన్నారు. ఆనంద్ ధార్మిక సంస్థల నిర్వాహకుడు అయ్యల సోమయాజుల బ్రహ్మానందం ఆధ్వర్యంలో శనివారం రాత్రి అమలాపురం కూచిమంచి అగ్రహారంలోని జానకీరామర్స్ కల్యాణ మండపంలో శ్రీమద్భగవద్గీత అంతర్గత నవమ స్కంధంలోని అంబరీషోపాఖ్యానంపై గరికపాటి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఆధ్యాత్మిక భావనలను పెంపొందించుకుంటూ ప్రతీ వ్యక్తి జీవితంలో ఉన్నతంగా ఎదగడం ఎంత ముఖ్యమో, జ్ఞాన సముపార్జనతో మోక్షాన్ని పొందడం కూడా అంతే ముఖ్యమని అదే అంబరీషోపాఖ్యానం ఉద్దేశమని వివరించారు. అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఆధ్యాత్మిక ప్రవచనంలో పాల్గొన్నారు.

అన్నం పెట్టి ఆదుకోండి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 28: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్నం పెట్టి వలంటీర్లను ఆదుకోవాలని కోరుతూ శనివారం కలెక్టరేట్ ఎదుట గాంధేయ మార్గంలో నిరసన తెలిపారు. అక్టోబరు 2 వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని వలంటీర్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ కె.సత్తిబాబు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చినహామీ మేరకు వలంటీర్లకు రూ.10వేలు వేతనం అందించి వారిని ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. నాయకులు సతీష్, బాలకృష్ణ, ఉగ్గిరాల సురేష్, మల్లారపు అజయ్‌కుమార్, రాయుడు ప్రసాద్, బొక్కా శ్రీనివాసరావు, ఉగ్గిరాల శివ, పనసా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపీఠంలో యాగం.. మల్లాడికి ఆహ్వానం

యానాం, అక్టోబరు28: కాకినాడలో శ్రీపీఠంపరిపూర్ణానంద స్వామి ఆధ్వర్యంలో జరగనున్న రెండో మహాశక్తి యాగానికి హాజరుకావాలని పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు ఆహ్వానం పంపారు. కాకినాడ శ్రీపీఠం ప్రతినిధులు మల్లాడిని కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఈసందర్భంగా మల్లాడిని సత్కరించి స్వామివారి చిత్ర పటాన్ని అందజేశారు. అక్టోబరు 3నుంచి 13వరకు మహాశక్తి యాగం నిర్వహిస్తామన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	దేవర-1
శ్రీలలిత	దేవర-1
శేఖర్ స్క్రీన్-1	దేవర-1
శేఖర్ స్క్రీన్-2	ఆయ్
రమా	ఆయ్
గణపతి	కమిటీ కుర్రోళ్లు
వెంకటపద్మావతిస్క్రీన్-1	దేవర-1
వెంకటపద్మావతి స్క్రీన్-2	గొర్రె పురాణం

రేబిస్‌కు చికిత్స లేదు

అమలాపురంటౌన్, సెప్టెంబరు28: రేబిస్‌వ్యాధి ప్రాణాంతకమైనదని, ప్రధానంగా కుక్కకాటు వల్ల ఇది వ్యాపిస్తుందని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ కె.వెంకట్రావు చెప్పారు. వ్యాధి సోకిన తరువాత చికిత్స లేదని, ముందుగానే కుక్కలకు రేబిస్ నియంత్రణ వ్యాక్సిన్ వేయించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. రేబిస్ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మున్సిపల్ మార్కెట్‌లో అమలాపురం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ఎల్.విజయారెడ్డి ఆధ్వర్యంలో వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా జంతు ప్రేమికులు శాంతికమల్, లక్ష్మీ ఐశ్వర్య, రాంజీ, శ్రీదేవి అందిస్తున్న సేవలను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ రాజు, డాక్టర్ వెంకట్రావులు అభినందించారు.102వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. లయన్స్ క్లబ్ గవర్నర్ అనిల్‌కుమార్‌జైన్, కార్యదర్శి మద్దెల వెంకటేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ హెబ్సిబా పాల్గొన్నారు.

కోటిపల్లి ఫెర్రీ వేలం వాయిదా

కె.గంగవరం, సెప్టెంబరు28: కలెక్టరు ఆదేశాలతో కోటిపల్లి ముక్తేశ్వరం ఫెర్రీ వేలం వాయిదా వేసినట్టు ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ తెలిపారు. ఫెర్రీలో 2025 మార్చి31వరకూ సుంకాలు వసూలు కోసం ఈనెల30న బహిరంగ వేలం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. తదుపరి తేదీని ప్రకటిస్తామన్నారు.

వీఆర్ఏ శ్రీరాములు మృతి

రాయవరం, సెప్టెంబరు 28: రాయవరంలో రెవెన్యూ సహాయకుడిగా పనిచేస్తున్న మల్లేశ్వరపు శ్రీరాములు(85) శనివారం మృతి చెందారు. ఆరు దశాబ్దాలుగా శ్రీరాములు రెవెన్యూ శాఖలో వీఆర్ఏ గా సేవలు అందిస్తున్నారు. అంత్యక్రియల ఖర్చుల క్రింద రూ.15వేలు అందజేసినట్లు ఆర్ఐ తెలిపారు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీఆర్ఏ మృతిపట్ల తహశీల్దారు ఐవీశెట్టి, ఆర్ఐ పంపన రామారావు, రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు.

కోటిపల్లి ఆలయ ఈవోగా భీమశంకరం

కె.గంగవరం, సెప్టెంబరు 28: కోటిపల్లి శ్రీఛాయాసోమేశ్వరస్వామి ఆలయ ఈవోగా జె.భీమశంకరం నియమితులయ్యారు. భీమశంకరం శనివారం కోటిపల్లి ఆలయంలో పూజలు నిర్వహించి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా తోట వాసు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు28:రామచంద్రపురం సబ్‌రిజిస్ట్రార్‌గా తోట వాసు బాధ్యతలు చేపట్టారు. పాలకొల్లునుంచిబదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడపనిచేసిన జగన్మోహనరావు అంబాజీపేట బదిలీపై వెళ్లారు.

అంబేడ్కర్ యూనివర్సిటీకి స్థల సేకరణ

అంతర్వేది, సెప్టెంబరు 28: అంతర్వేదిలో అంబేడ్కర్ యూనివర్శిటీ ఏర్పాటుకు స్థల సేకరణ చేస్తున్నట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. అంతర్వేది ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. అంతర్వేది తీరప్రాంతంలో డ్రెడ్జింగ్ హార్బరు నిర్మాణం కోసం సేకరించిన స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి ఎమ్మెల్యే దేవ పరిశీలించారు. వశిష్టాశ్రమాన్ని ఆనుకుని ఉన్న మత్స్యకార సొసైటీ స్థలాన్ని పరిశీలించినట్టు తెలిపారు. అంతర్వేదిలో అంబేడ్కర్ యూనివర్శిటీ నిర్మాణాలు చేపడితే భావి తరాలకు ఉపాధి కల్పనతో ఇక్కడ పరిసరాలు ఏర్పాటవుతాయన్నారు. అనంతరం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని లడ్డూ తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ పోతురాజు కృష్ణ, చాగంటి స్వామి, పొన్నాల ప్రభ, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

జనసేన పాదయాత్ర

అల్లవరం, సెప్టెంబరు 28: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా తిరుపతి లడ్డూ అపవిత్రతకు నిరసనగా అమలాపురంలో ప్రారంభించిన వేంకటేశ్వరస్వామి రథయాత్ర, పాదయాత్ర బోడసకుర్రు మీదుగా సాగింది. గోవింద నామస్మరణలతో జనసైనికులు పాదయాత్రలో పాల్గొన్నారు. నల్లా శ్రీధర్, లింగోలు పండు, ఆర్‌డీఎస్ ప్రసాద్, యేడిద శ్రీను, నల్లా అజయ్, కొప్పుల మానస, అడపా దత్తుడు, కంకిపాటి వీరబాబు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, మద్దింశెట్టి ప్రసాద్, పోలిశెట్టి బాబులు, ఆకుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డీఈగా నాగేంద్రకుమార్



పి.గన్నవరం, సెప్టెంబరు28: పి.గన్నవరం ఇరిగేషన్ సబ్‌డివిజన్ డీఈగా ఆర్.నాగేంద్రకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడపనిచేసిన కె.వెంకటేశ్వరరావు రాజమహేంద్రవరం బదిలీపై వెళ్లారు. నాగేంద్రకుమార్‌కు జేఈలు ఎ.నాయుడు, సుందర్‌సింగ్, బి.రమేష్, వి.మాధవ, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు చొల్లంగి సత్తిబాబు, ఆరుమిల్లి సాయిబాబు, కె.సత్యనారాయణ రాజు, కార్యాలయ సిబ్బంది, లష్కర్లు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందించారు.

సేవలు మరింత మెరుగుపరుస్తాం



రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 28: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సిద్దెల రాజబాబు అన్నారు. శనివారం స్థానిక డీఈఈ కార్యాలయంలో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారులు 1912 టోల్ ఫ్రీనెంబరును సంప్రదించాలన్నారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న లైన్లు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈఈ కె.రత్నాలరావు, ఏడీఈ కంచుమర్తి మురళీమోహన్, ఏఈలు మేడిశెట్టి వెంకటరమణ, డి.ఎం.కె.డి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఏడీఈగా శ్రీనివాసరావు



ముమ్మిడివరం,సెప్టెంబరు28:ముమ్మిడివరం ఎలక్ట్రికల్ ఏడీఈగా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఈగా పనిచేసిన వీరభద్రరావు కాకినాడ బదిలీపై వెళ్లారు. ఏలూరుసిటీ ఏడీఈగా పనిచేసిన శ్రీనివాసరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

ఉప్పలగుప్తం ఎస్ఐగా రాజేష్



ఉప్పలగుప్తం, సెప్టెంబరు 28: ఉప్పలగుప్తం ఎస్ఐగా చలమల రాజేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్పెషల్ బ్రాంచ్ నుంచి ఇక్కడ నియమితులయ్యారు.

అమలాపురం ఆర్డీవోగా మాధవి



అమలాపురం టౌన్, సెప్టెంబరు 28: అమలాపురం ఆర్డీవోగా కొత్త మాధవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. తిరువూరు ఆర్డీవోగా పనిచేస్తున్న మాధవి బదిలీపై అమలాపురం వచ్చారు. ఇక్కడ పనిచేసిన జి.కేశవర్ధనరెడ్డిని కనిగిరి ఆర్డీవోగా బదిలీ చేశారు. మాధవిని పలువురు తహసీల్దార్లు, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది అభినందించారు.

రామచంద్రపురం ఎస్ఐగా శ్రీనివాస్



రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 28: రామచంద్రపురం ఎస్ఐగా ఎస్.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌లో ఉన్న ఆయన ఎస్ఐగా ఇక్కడకు వచ్చారు. గతంలో ఆయన ఆత్రేయపురం ఎస్ఐగా పనిచేశారు.

రైతులకు వరి పంటపై అవగాహన

రాజోలు, సెప్టెంబరు 28: చెన్నడంలోని పోలేరమ్మ గుడి ప్రాంగణంలో రైతులకు ఖరీఫ్ వరి పంటపై వ్యవసాయశాఖ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. ప్రధానంగా తెగుళ్లు, సమీకృత సస్యరక్షణపై జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్ రైతులకు అవగాహన కల్పించారు. బ్యాక్టీరియా, ఎండుఆకు తెగులు, వరికాండం తొలుచు పురుగు గురించి వివరిస్తూ నత్రజని, పోటాష్‌లు ఎలా సమపాళ్లలో వాడాలో సూచించారు. రాజోలు ఏడీఈ రామ్మోహన్, ఏవో మధుకుమార్, సర్పంచ్ బడుగు శ్రీనివాసరావు, వీఏఏ బాలాజీ పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో వెంకన్న ఆలయంలో పూజలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 28: తిరుపతి లడ్డూ విషయాన్ని సీఎం చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ నాయకులు ముమ్మిడివరంలో నగర పంచాయతీ పరిధి పల్లిపాలెం శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లడ్డూ విషయంలో మాజీ సీఎం జగన్ ప్రమేయం ఉన్నట్టు ఆరోపణ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పితాని బాలకృష్ణ, కాశి బాలమునికుమారి, కమిడి ప్రవీణ్‌కుమార్, నేల కిశోర్, కుడుపూడి శంకరరావు, కోలా బాబ్జి, పిన్నమరాజు శ్రీనివాసరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పి.గన్నవరం: శ్రీవారి లడ్డూ విషయంలో కల్తీ విషయంలో కూటమి ప్రభుత్వం అసత్య ప్రచారాలు మానుకోవాలని జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. పోతవరం శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూటమి నాయకులకుమంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ పూజలు చేసి అనంతరం ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, పీకేరావు, నక్కా వెంకటేశ్వరావు, దొమ్మేటి శివరామన్, వడలి కొండయ్య, కొంబత్తుల ఏసు, దేశరాజు సీతారామయ్య(సాయి) పాల్గొన్నారు.

మామిడికుదురు: తిరుపతి లడ్డూ ప్రసాదం వివాదంపై సీబీఐతో విచారణ జరిపించాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండు చేశారు. సీఎం చంద్రబాబుకు బుద్ధి రావాలంటూ వైసీపీ శ్రేణులతో కలిసి గొల్లపల్లి మామిడికుదురులోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజాకుమారి, పార్టీ నాయకులు బొలిశెట్టి భగవాన్, కటకంశెట్టి ఆదిత్యకుమార్, వర్ధినేని రాము, యెరుబండి సత్యనారాయణమూర్తి, మొల్లేటి సత్యనారాయణ, రామేశ్వరపు పోతన పాల్గొన్నారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం వైసీపీ నాయకులు పూజలు చేశారు. తిరుమల ప్రతిష్ఠతను రాజకీయాల కోసం సీఎం చంద్రబాబు అప్రతిష్ఠ తెచ్చారని పాప ప్రక్షాళనకు పూజలు నిర్వహించినట్లు నియోజకవర్గ కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, మాజీ ఏపీఐడిసి డైరెక్టరు శ్యామ్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: శ్రీవారు లడ్డూను అవమానించిన సీఎం చంద్రబాబు హిందువులకు క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుపతి నుంచి తీసుకువచ్చిన లడ్డూలను తలపై పెట్టుకుని స్వామివారి మాఢ వీధుల్లో ప్రదక్షిణ చేసి దర్శించుకున్నారు. ఆలయ మాజీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, వాడపల్లి ఉపసర్పంచ్ పి.బాబురావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మండపేట: భక్తుల మనోభావాలు దెబ్బతినేలా సీఎం చంద్ర చంద్రబాబు రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి తోట అనుచరులతో కలిసి బైక్ ర్యాలీగా బయలుదేరి కలవపువ్వు సెంటరులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని తోట ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, వైసీపీ నేతలు రెడ్డి రాధాకృష్ణ కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, షేక్ ఆలీఖాన్ బాబా, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార మహాజన సభ

మలికిపురం, సెప్టెంబరు 28: రామరాజులంకలో వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ సంఘ ఇన్‌చార్జి గుబ్బల మురళీసత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగింది. 1920లో స్థాపించబడిన ఈసంఘంలో 720 మంది సభ్యులతో రూ.6కోట్ల వ్యాపార లావాదేవీలతో రూ.51లక్షల డిపాజిట్ కలిగి ఉందని సీఈవో నారాయణరావు ప్రకటించారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, సర్పంచ్ కాకర శ్రీనివాస్, ఉపసర్పంచ్ మేడిచర్ల గంగన్న, సొసైటీ మాజీ అధ్యక్షుడు చొప్పల రాజేవ్వరరావు, నల్లి శివ, దేశినీడి భాస్కరరావు పాల్గొన్నారు.